క్లుప్తంగా

చండీహోమం



విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి చండీహోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంకు చెందిన వేద పండితులు జి.సత్య కిరణ్ చండీహోమం జరిపారు. కర్పూరం శ్రవణ్, తులసి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహన్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో..



మద్ది క్షేత్రాన్ని దర్శించిన గోపాలకృష్ణను సత్కరిస్తున్న ఈవో

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారిని శనివారం రాష్ట్ర సర్వే డిపార్టుమెంట్ ఉన్నతాధికారి (ఐఏఎస్) గోపాలకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలుకగా స్వామి వారి దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం శేష వస్త్రాన్ని కప్పి సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్లీవ జోజి, సర్వేయర్ తులసి తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవం



మంగపతిదేవిపేట గ్రామంలో పోషణ మాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మంగపతిదేవిపేటలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నయోమిరాణి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీటీసీ తేలే శ్రీనివాస్ మాట్లాడుతూ పోషణ మాసోత్సవ ప్రాముఖ్యతను ప్రదర్శనల ద్వారా ప్రజలలోకి తీసుకు వెళుతుండడం హర్షణీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు వారి తల్లులకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందజేస్తూ వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతోందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులను సన్మానించి సారే సమర్పించారు. స్థానిక ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయండి



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్‌ను కోరారు. శనివారం ఆమె ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి, పలు సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఆఫీస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయవలసిందిగా ఆమె కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ త్వరలోనే ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటానన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మండలంలోని జల్లేరులో ఉన్న ఎంపీపీ పాఠశాలలో శనివారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు మారిశెట్టి మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో జల్లేరు పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన కురసాల రామకృష్ణ, ఎంవీ పద్మావతిలను సత్కరించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్ అప్పలనాయుడు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించడంలో వారి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగించు విఘ్నేశా

చింతలపూడి: వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా గత ఆరు రోజులుగా మండపాల్లో పూజలందుకున్న విఘ్నేశ్వర విగ్రహాలను శనివారం ఊరేగించి నిమజ్జనం చేశారు. మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, బాణసంచాల నడుమ గణేష్ ప్రతిమలను పుర వీధుల్లో ఊరేగించారు. యువత డీజే సౌండ్‌ల నడుమ ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెలగలపల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని ఊరేగించి అనంతరం నాగిరెడ్డిగూడెం సమీపంలోని తమ్మిలేరు జలాశయంలో భక్తుల జయజయ ధ్వానాల మధ్య నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సమారాధన చేశారు.

లడ్డూ వేలం

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా శనివారం అన్నసమారాధనలు, ఊరేగింపు, నిమజ్జన ఉత్సవాలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెం థియేటర్ గణపతి వద్ద నిర్వహించిన భారీ అన్న సమారాధనను ఎస్సై జీజే విష్ణువర్ధన్ ప్రారంభించారు. స్వామివారికి ప్రసాదంగా సమర్పించిన పదకొండు కేజీల లడ్డును షేక్ బెనర్జీ రూ.16 వేలకు, 5 కేజీల లడ్డూను గొరుసు రాకేష్ రూ.8,100కు దక్కించుకున్నారు. అలాగే స్థానిక ఫంక్షన్ హాల్ యువత అశ్వరథంపై గణనాథుని ప్రతిమను జాతీయ ప్రధాన రహదారులపై ఊరేగింఇచారు.



వెలగలపల్లి గ్రామంలో ఊరేగుతున్న ఏకదంతుడు



కొయ్యలగూడెం థియేటర్ వద్ద వేలంలో లడ్డూలను దక్కించుకున్న భక్తులు

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

లింగపాలెం: గణపతి ఉత్సవాల సందర్భంగా మండలంలోని గణనాథుని విగ్రహాలను శనివారం ఘనంగా ఊరేగించారు. ఈ మేరకు వినాయక ప్రతిమలను ట్రాక్టర్‌పై పెట్టి సుందరంగా అలంకరించి గ్రామంలోని పురవీధుల్లో మేళతాళలతో, విచిత్ర వేషధారణల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. రంగాపురం, లింగపాలెం, బాదరాల, కె గోకవరం తదితర గ్రామాల్లో ఊరేగింపులు ఆకట్టుకున్నాయి. అనంతరం గణపతి విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

- **బుట్టాయగూడెం:** స్థానిక దేవుడి మాన్యంలో ప్రత్యేక పందిరిలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమకు శనివారం ఊరేగింపు నిర్వహించారు. డీజేలతో యువకులు ఉత్సాహంగా డాన్స్‌లు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయంలో నిమజ్జం చేశారు.

అన్నసమారాధన

టి.నరసాపురం: మండలంలో వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయక చవితి పందిళ్ల వద్ద శనివారం అన్నసమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం తదితర గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం గణేష్ ఊరేగింపులు నిర్వహించారు. వెలగపాడులో గణనాథుడిని ఊరేగించి స్థానిక ఊర చెరువులో నిమజ్జనం చేశారు.

- **ద్వారకాతిరుమల:** మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అందులో భాగంగా ద్వారకాతిరుమల తూర్పు వీధిలోను, దొరసానిపాడులో నెలకొల్పిన గణేష్ విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు తీన్మార్ డప్పు వాయిద్యాలు, డీజే సందళ్లు, యువత నృత్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి స్థానిక కోనేరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ద్వారకాతిరుమలలోని సొసైటీ పెట్రోల్ బంక్ వద్ద మెకానికల్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.



లింగపాలెంలో ట్రాక్టర్‌పై వినాయకుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెంలో బొజ్జగణపయ్యను ఊరేగిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో ఊరేగుతున్న గణనాథుడు



కొయ్యలగూడెంలో అశ్వరథంపై లంబోదరుడి ఊరేగింపు

ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

జంగారెడ్డిగూడెం: ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. గతేడాది టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.23 వేలు ఉంటే అది రూ.12,900కు పడిపోయిందన్నారు. టన్నుకు రూ.18 వేలు ధర ఇవ్వాలని ఆయన కోరారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన సంఘ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో కార్పొరేట్ కంపెనీలకు రూ.12 లక్షల కోట్ల రుణమాఫీ చేసిందని, ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు మాత్రం ఒక్క పైసా కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. సమావేశంలో సంఘ నేత బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరి వాసునికి 108 రజిత పుష్పాల బహూకరణ



పారిజాతగిరిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ, బాలభోగం, తీర్థప్రసాదగోష్ఠి అనంతరం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. స్వామివారికి జి.శ్రీనివాస్, ధనలక్ష్మి కుటుంబసభ్యులు 108 రజిత పుష్పాలను బహూకరించారు. భక్తులకు సరిపల్లికి చెందిన నులకాని శ్రీనివాస్, జ్యోతి దంపతులు, ఎ.వెంకట్రావు, పి.పార్థసారథి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మానికల రాంబాబు, రెడ్డి రంగప్రసాద్, వాసవీసాయి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న డా కృష్ణ కిషోర్

చింతలపూడి: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కె గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ కృష్ణకిషోర్ అన్నారు. శనివారం ప్రగడవరం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఆయుష్మాన్‌భవ కార్యక్రమం క్రింద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య సేవలు, వైద్య పరీక్షలు, టెలీ మెడిసిన్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా జీవించాలని సూచించారు. శిబిరంలో రోగులను పరీక్షించి మందులు అందచేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్, ఎంఎల్‌హెచ్‌పీ భరత్‌కుమార్, నర్మదా రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పోలవరం రూరల్: పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామంలో పారిశుధ్య విధులకు హాజరవుతున్న మజ్జి వెంకటేశ్వరరావు అనే పారిశుధ్య కార్మికుడిపై దౌర్జన్యం చేసిన ఘటనకు సంబంధించి గేదెల బాబూరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. పనులకు వెళుతున్న సమయంలో బాబూరావు దుర్భాషలాడి కొట్టినట్లు వెంకటేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పత్తి పైరును పరిశీలించిన శాస్త్రవేత్తలు

లింగపాలెం: మండలంలోని పలుగ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి పైరును ఏరువాక శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు శాస్త్రవేత్తలు డాక్టర్ కె ఫణికుమార్, టి సుజాత పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పత్తి పైరు 70 నుంచి 90 రోజులు వయస్సు కల్గి ఉన్నాయన్నారు. పత్తి పైరుకు రసం పీల్చు పురుగు ఎక్కువగా ఆశించిందని, అదే విధంగా పేనుబంక, పచ్చదోమ కూడా పైరును ఆశించినట్లు తెలిపారు. దీంతో ప్రతి మొక్క ఆకులు ముడుచుకుని పసుపురంగులోకి వస్తాయని ఆకులు ఎండి రాలిపోవటం జరుగుతుందన్నారు. వీటి నివారణకు క్లోరోఫైడ్ 0.5 మిల్లీలీటర్లు, లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి మొక్క తడిచేటట్లు పిచికారీ చేయాలన్నారు. మొక్క ఎదుగుదలకు పోటాషియమ్ నైట్రేట్ 10గ్రా ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రైతుల అభివృద్ధికి తోడ్పడాలి

కామవరపుకోట: సహకార పరపతి సంఘాలు రైతుల అభివృద్ధికి తోడ్పడాలని సహకార పరపతి సంఘం జిల్లా అధికారి జాన్ మెల్టన్ అన్నారు. శనివారం మండలంలో తడికలపూడి విశాల సహకార పరపతి సంఘాన్ని సందర్శించి, సంఘంలో రైతులకు అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ అభివృద్ధితోపాటు, రైతులకు ఎరువులు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చేటువంటి చర్యలను శరవేగంగా తీసుకుని వారి అభివృద్ధికి తోడ్పడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సొసైటీ ఆవరణలో నిర్వహించబడుతున్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు గుర్రాల రవికుమార్, వీరిశెట్టిగూడెం గ్రామ సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, జిల్లా సొసైటీ రిజిస్ట్రర్ మోహన్‌బాబు, ఆడిటర్ నరసింహ రాజు, పీఐసీ లక్ష్మణరావు, కార్యదర్శి మామిళ్ల, రైతు భరోసా కేంద్రం హార్టికల్చర్ అసిస్టెంట్ వల్లూరు ప్రేమ్ పాల్గొన్నారు.



తడికలపూడిలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన జాన్ మెల్టన్

నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

చింతలపూడి: చింతలపూడి సబ్ జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు శనివారం సందర్శించారు. సబ్‌జైల్‌లో ఉన్న ముద్దాయిలను ఆహారం, వసతి, వైద్య సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ముద్దాయిల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను పెట్టుకునే స్థోమత లేని నిందితులు, శిక్షలు పడి అప్పీలు చేసుకునే అవకాశం లేని ముద్దాయిలకు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి న్యాయ సహాయం అందచేస్తామని తెలిపారు. నేర ప్రవత్తికి దూరంగా ఉండాలని సూచించారు. ఒక సారి జైలుకు వచ్చిన వారు తిరిగి రాకూడదని అన్నారు. కష్టపడి పని చేసుకుని సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించాలనుకుంటే జైల్లో గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ జి వెంకటేశ్వరరావు, జైల్ విజిట్ ప్యానెల్ న్యాయవాదులు బుల్లా ఏసుపాదం, డేవిడ్ రాజు, సోషల్ వర్కర్ అక్బర్ అలి, న్యాయవాదులు పాల్గొన్నారు.



సబ్ జైల్లో ముద్దాయిలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

జిల్లాస్థాయి పోటీలకు రాజవరం విద్యార్థులు

కొయ్యలగూడెం: జిల్లాస్థాయి ఆటల పోటీలకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు రాజవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బి.రామారావు శనివారం పేర్కొన్నారు. బుట్టాయిగూడెంలో ఈనెల 22వ తేదీన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో త్రోబాల్‌లో ఐదుగురు, ఖోఖోలో, నలుగురు, వాలీబాల్ క్రీడలో ఇద్దరు టెన్నికాయిట్ పోటీల్లో ఇద్దరు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. అదేవిధంగా జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు ఏపీఆర్‌ఎస్ పాఠశాలలో పోలవరం నియోజకవర్గ స్థాయి ఎస్జీఎఫ్ స్కూల్ గేమ్స్ సెలెక్షన్లు నిర్వహించారని అన్నారు. దీనిలో తమ హైస్కూల్ విద్యార్థులు త్రోబాల్లో పది మంది, ఖోఖోకి నలుగురు, టెన్నికాయిట్‌కి ఒకరు జిల్లా స్థాయి ఎంపికలకు అర్హత సాధించారన్నారు.



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన రాజవరం విద్యార్థులు

నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను జంగారెడ్డిగూడెం ఎంఈఓలు రాముడు, రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేవీఎస్ లోవకుమారి ప్రారంభించారు. 200 మంది విద్యార్థులు ఈ క్రీడలలో పాల్గొన్నారు. అండర్-14, 17 విభాగాలలో బాలురు, బాలికలలకు పాఠశాలల పీడీలు, పీఈటీలు పోటీలను నిర్వహించారు. నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త పి.వేణు, మండల సమన్వయకర్త ఎల్.జయరాజు పోటీలను పర్యవేక్షించారు. జిల్లా ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎ.సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.




గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవోలు రాముడు, రాములు, హెచ్‌ఎం కేవీఎస్ లోవకుమారి

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు



టి.నరసాపురం: క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులతో కేతవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



లింగపాలెం : అండర్ 14, 17 విభాగంలో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన కొత్తపల్లి బాలికలు

టి.నరసాపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కేతవరం జెడ్పీ హై స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలలో శనివారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి.కృష్ణ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన పెదవేగిలో నిర్వహించిన బేస్‌బాల్ అండర్-14 విభాగంలో కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెలగ రవీంద్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అలాగే పోలవరం నియోజకవర్గం స్థాయిలో బుట్టాయగూడెం, జీలుమమిల్లి మండలం బరింకలపాడులో ఈ నెల 20, 22 తేదీల్లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో బేతి హర్ష, మేకా మోషిత, ట్రిపుల్ జంప్, టెన్నీకాయిట్‌లలో కొమ్మంటి ప్రభాకర్, బాడ్మింటిన్‌లో కొండపల్లి శ్రీను, యోగాలో మేకా నాగచైతన్య, కాసగాని మౌనిక, కొలుకులూరి హేమశ్రీ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తపల్లి విద్యార్థుల ఎంపిక

లింగపాలెం: ఈనెల 21వ తేదీన పెదవేగిలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో కొత్తపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం మరియరాజు శనివారం విలేకర్లకు తెలిపారు. అండర్14 విభాగంలో బేస్‌బాల్ పోటీలో కె.పల్లవి, కె.లక్ష్మికుమారి, అండర్-17 విభాగంలో సాఫ్టబాల్ పోటీలో డి.వాహిని, ఏ దివ్య వైష్ణవి, వి.మత్సవింద రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే చింతలపూడి నియోజకవర్గ స్థాయిలో కామవరపుకోట హైస్కూల్‌లో జరిగిన త్రిబాల్ సెలక్షన్లలో కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో త్రోబాల్ పోటీలో డి వాహిని, కె మీనాక్షి, కె.శివదుర్గ, జి.హర్షవర్ధన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం జి మరియరాజు, పీడీ కామేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

మలాథియన్ స్ప్రేయింగ్

పోలవరం రూరల్: వింజరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 3వ విడత మలాథియన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఎవరికైనా జ్వరాలు వస్తే పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఏవో సీహెచ్ శ్రీనివాసబాబు, మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

30లోపు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

బుట్టాయగూడెం: మార్చి 2024లో నిర్వహించే ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే 2023 సంవత్సరం విద్యార్థులు, అంతకు ముందు పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులు ఈనెల 30వ తేదీనలో పరీక్ష ఫీజును ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెల్లించాలని ప్రిన్సిపాల్ జి.భక్త హనుమాన్ శనివారం విలేకరులకు తెలిపారు. ఆధార్ కార్డుజిరాక్స్, ఫొటో, ఆఖరిగా రాసిన పరీక్షలకు సంబంధించిన మార్కుల మెమోతో కళాశాల ఆఫీసులో ఫీజు చెల్లించవచ్చన్నారు. వివరాలకు 89852 22422 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తన కొడుకు మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని విన్నపం



వివరాలు వెల్లడిస్తున్న పెరంబాబు తల్లి

కుకునూరు: తన కొడుకు మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఓ తల్లి శనివారం విలేకరుల వద్ద మొరపెట్టుకుంది. ఫిబ్రవరి 7వ తేదీన తన కుమారుడు గొర్ల పెరంబాబు మృతి చెందాడని గొర్ల మాణిక్యం తెలిపింది. పెరంబాబును తన కోడలు కృష్ణవేణి, ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న సురేష్ హత్య చేశారని పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టినట్లు చెప్పింది. మూడు నెలలుగా పోస్టుమార్టం రిపోర్టు ఇవ్వకుండా పోలీసులు తిప్పుకుటుంన్నారని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో జిల్లా ఎస్పీని కలిసి తన గోడును వెళ్లబోసుకోగా ఎస్పీ ఆదేశాల మేరకు 2 నెలల క్రితం పోలీస్‌స్టేషన్‌కు పిలిచి శవపరీక్ష రిపోర్టులు వచ్చాయని చెప్పారని, అయితే ఇంకా విచారణ జరుగుతోందంటూ మరలా రెండు నెలలు స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నారని ఆమె వాపోయింది. ఈ నెల 17వ తేదీన మా కుటుంబసభ్యులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పెరంబాబును గొంతు నులిమి హత్యచేశారని పోలీసులు చెప్పారన్నారు. పెరంబాబును తన భార్య గొంతుపట్టుకుని తోసివేయడంతో చనిపోయాడని విచారణలో తేలిందని పోలీసులు చెబుతున్నారని, కానీ సురేష్ ప్రమేయం లేదంటున్నారని చెప్పింది. తన కోడలు కృష్ణవేణి, సురేష్ ఇద్దరూ కలిసి తన కుమారుడు పెరంబాబును హత్యచేశారని.. సమగ్ర విచారణ చేసి తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కోరింది.